

సిద్దిపేట టౌన్ : ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తజనం

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు

## ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని వైష్ణవాలయాలు భక్తులతో కిట కిటలాడాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, జనగామ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు. పలు గ్రామాల్లో నామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు.

**- జిల్లా నెట్‌వర్క్, డిసెంబర్ 23**



మద్దూరు : గాగిల్లాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వర్గల్ : నాచగిరిక్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి వారు



గజ్వేల్ : వేంకటేశ్వర ఆలయంలో కొలువుదీరిన స్వామివారు



వర్గల్ : శ్రీకళ్యాణ- వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చంద్రశేఖరశర్మ సిద్ధాంతి



నంగునూరు : కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



హుస్నాబాద్ టౌన్ : ముక్కోటి ఏకాదశి సందర్భంగా పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దంపతులు



మర్కూక్ : ముక్కోటి ఏకాదశి పూజల్లో పాల్గొన్న భక్తులు



సిద్దిపేట రూరల్ : స్వామివారిని ఊరేగిస్తున్న చైర్మన్ రంగాచార్యులు, సర్పంచ్ నరేశ్‌గౌడ్, భక్తులు



చేర్యాలలో వేణుగోపాల స్వామివారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి

## రాజీయే రాజమార్గం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్**



విడిపోయిన దంపతులను కలిపిన న్యాయమూర్తి

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 23 : రాజీయే రాజమార్గం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో ఫ్రీ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని కేసుల పరిష్కారానికి ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జిలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ

చేర్యాల, డిసెంబర్ 23 : శ్రీకనకదుర్గామాత ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన చేర్యాల పట్టణంలో చోటు చేసుకుంది. ఆల య కమిటీ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకా రం.. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెండు హుండీలను శుక్రవారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి గర్భాలయంలో పెట్టి తాళం వేసి వెళ్లిపోయారు. అర్ధ రాత్రి దొంగలు అమ్మవారి ఆలయ తలుపులు పగల గొట్టి అందులోని రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. ఒక హుండీ బరువు ఎక్కువగా ఉండడంతో అమ్మవారి ఆలయం వెనుకభాగంలో దానిని పడేశారు. మరో హుండీని గాంధీ విగ్రహం సమీపంలోని గల్లీలో తెరిచి అందులో ఉన్న సుమారు రూ. 15 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు.

## ఇద్దరు దొంగలు అరెస్ట్

తొగుట, డిసెంబర్ 23 : బోరు మోటర్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన తొగుట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లింగం వివరాల ప్రకారం.. చందాపూర్ శివారులో శనివారం ఉదయం పోలీసులు వా హనాలు తనిఖీ చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు మోటర్ సైకిల్‌పై వచ్చి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పోలీసులు పట్టుకొని విచారించారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లికి చెందిన బొడ్డు రమేశ్, ప్రశాంత్‌గా గుర్తించారు. ఆ ఇద్దరూ అదే గ్రామానికి చెందిన నీల వెంకటేశ్‌తో కలిసి తొగుట, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో బోరు మోటర్లు దొంగతనం చేస్తూ వాటిని అమ్ముకుందామని ప్లాన్ వేశారు. వారి వద్ద నుంచి మూడు బోరు మోటర్లు, ఒక వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

హుస్నాబాద్, డిసెంబర్ 23 : హుస్నాబాద్ పట్టణంలోని నవభారత్ హైస్కూల్‌లో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంతాక్లాజ్ వేషధారణ, ఆటపాటలతో అలరించారు. సిద్దిపేటలోని మెడికేర్ రిచ్ దవాఖానతో పాటు అర్బన్ మండలంలోని ఆయా గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని క్రిస్టియన్ భవనంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఆర్డీవో బన్సీలాల్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ క్రైస్తవులకు కానుకలు అందజేశారు. మద్దూరు మండలం గాగిళ్లాపూర్ బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో ఫాదర్ వై.సామ్‌సన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

## కిష్టయ్య మృతి పార్టీకి తీరనిలోటు

హుస్నాబాద్, డిసెంబర్ 23 : హుస్నాబాద్ మండలం నాగారం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ఇజ్జగిరి కిష్టయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ అన్నారు. శనివారం కిష్టయ్య మృతదేహాన్ని ఆయన సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ కిష్టయ్య అకాల మరణం తనను ఎంతో కలిచివేసిందన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మల్లేశ్ వెంట సీపీఐ గ్రామ కార్యదర్శి కిష్టయ్య, నాయకులు మల్లేశం, వెంకటయ్య పాల్గొన్నారు.



కిష్టయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మల్లేశ్, నాయకులు

## భగవద్గీత గ్రంథాల పంపిణీ

గజ్వేల్, డిసెంబర్ 23 : శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. గీత జయంతిని పురస్కరించుకొని కృష్ణాలయంలో భక్తులకు ఉచితంగా గ్రంథాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మనిషిలో నిరాశను పోగొట్టి ఆశాజీవిగా భగవద్గీత మారుస్తున్నదన్నారు. ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్న రామకోటి రామరాజు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్‌బాబు, రామచంద్రం, వెంకటేశం, లక్ష్మయ్య పాల్గొన్నారు.



భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌పై ఫిర్యాదు చేయడం తగదు

మిరుదొడ్డి, డిసెంబర్ 23 : దళిత నాయకులు రాజకీయంగా ఎదగడం మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌కు ఇష్టంలేదని ఎంపీపీ సాయిలు, జడ్పీటీసీ లక్ష్మిలింగం, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రాజు అన్నారు. శనివారం మిరుదొడ్డి టౌన్‌తో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యపై మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం తగదన్నారు. దళితులపై రఘునందన్‌రావుకు ఎంత ప్రేముందో అర్థమవుతుందన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి, వైస్ ఎంపీపీ రాజులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు

**రఘునందన్‌కు దళితులంటే చిన్నచూపు..**

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 23 : మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు మొదటి నుంచి దళితులంటే చున్నచూపు అని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యుడు భీమాసేన ఆరోపించారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్కి వెంకటయ్యపై రఘునందన్‌రావు గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో మండిపడ్డారు. బక్కి వెంకటయ్య.. బీఆర్‌ఎస్‌కు గానీ, కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేయాలన్నట్లుగా ఆధారాలుంటే చూపాలని డిమాండ్ చేశారు. మచ్చలేని నాయకుడు వెంకటయ్యపై చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలన్నారు. సమావేశంలో దళిత, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.